



యూనిఫామ్‌గా నాట్లు

యూనిఫామ్ వేసుకుని నాట్లు వేస్తున్న వీరు వ్యవసాయ కళాశాల విద్యార్థులు అనుకుంటే తప్పులో కాలేసినట్టే... వీరంతా బెంగాల్ నుంచి వచ్చిన వ్యవసాయ కూలీలు. శుక్రవారం ఉండ్రాజవరం మండలం చిలకపాడులో ఇలా ఒకేరంగు టీషర్టులు ధరించి నాట్లు వేశారు..

కూటమిలో కుంపటి

- నెల రోజుల్లో ఇద్దరు జనసేన ఇన్‌ఛార్జులు ఔట్
- భగ్గుమంటున్న జనసైనికులు, జనసేనాని తీరుపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి నివురుగప్పిన నిప్పులా ఉన్న టిడిపి శ్రేణులు, జనసైనికుల మధ్య నెలకొన్న విభేదాలు తాజాగా మరోసారి భగ్గుమనడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైంది. అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లో ఎంపీ పురంధేశ్వరి సమక్షంలో రాజానగరం నియోజక వర్గంలో జరిగిన ఓ సభలో జనైనికులు, టిడిపి శ్రేణులు బాహాబాహికి దిగిన విషయం విధితమే. తాజాగా కొవ్వూరు నియోజక వర్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. తమ పార్టీకి ప్రాధాన్యత లభించటంలేదంటూ జనసేన ఇన్‌ఛార్జి టివి.రామారావును రోడ్డెక్కారు. ఈ ఘటనలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి తమ వాటాను దక్కించుకోవాల్సిన జనసేనాని పూర్తి భిన్నంగా వ్యవహరించారు. కొవ్వూరు నియోజక వర్గంలో సహకార సంఘాల అధ్యక్షుల నియామకాల్లో జనసేనకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని రామారావు ఆందోళన బాట పట్టారు. తాము ఎవరికి వ్యతిరేకం కాదంటూనే టిడిపి తీరును నిరసన ద్వారా ఎండగట్టారు. ఈ నేపథ్యంలో ఎటువంటి విచారణ చేపట్టకుండానే అదే రోజు సాయంత్ర టివి రామారావును సస్పెండ్ చేస్తున్నట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించడం సర్వత్రా విమర్శలకు దారి తీసింది. జన



సొసైటీ పదవుల కేటాయింపులో అన్యాయం జరిగిందటూ రాస్తారోకో చేస్తున్న టివి.రామారావు(ఫైల్)

సైనికులను ఆందోళనకు గురి చేసింది.తాజా పరిణామాలపై జన సైనికులు సోషల్ మీడియా వేదికగా జనసేన పెద్దల తీరుపై విమర్శల వర్షం కురిపించారు. దీంతో కొవ్వూరు సహకార సంఘాల అధ్యక్షుల ఎంపిక, అక్కడి పరిస్థితులపై విచారణ జరుపుతామంటూ ఆ పార్టీ కాలకల్ప చికిత్సకు తెరలేపింది.

గత నెలలో సినిమా థియేటర్స్ బంద్ రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం విధితమే. జిల్లాలో సినిమా థియేటర్ల యాజమాన్యాలు సమావేశమై ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎదుట కొన్ని డిమాండ్‌లను ఉంచారు. అయితే దీనిపై సానుకూలంగా స్పందించాల్సిన ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరించింది. రాజమహేంద్రవరం జనసేన ఇన్‌ఛార్జి అత్తి సత్యనారాయణను సస్పెండ్ చేసింది. పవన్ కళ్యాణ్ సినిమా రిలీజ్ నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా కుట్ర జరిగిందంటూ ప్రతి విమర్శలకు దిగింది. సినిమా థియేటర్ల యాజమాన్యాల సమస్యలను పరిష్కరించకపోగా రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహించింది. క్యాంటీన్‌లలో అధిక ధరలు, నిర్వహణ నేపథ్యంలో కేసులు నమోదు చేసింది. ఈ సమస్య ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ తాజా పరిస్థితుల నేపథ్యంలో కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వ్యవహరించిందనే విమర్శను ప్రభుత్వం మూటగట్టుకుంది. మరోవైపు అత్తి సత్యనారాయణ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి కీలకంగా పనిచేస్తున్నారు. 2019 ఎన్నికలలో టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థికి గట్టి పోటీ ఇచ్చారు. తాజాగా జరిగిన 2024 ఎన్నికలలో కూటమి పొత్తులో భాగంగా టిడిపికి టిక్కెట్ కేటాయించినా ఆదిరెడ్డి వాసు గెలుపునకు తనవంతు కృషి చేశారు. వైసిపి పాలనలో ఎన్నికలకు నోచుకోని కార్పొరేషన్‌కు ఎట్టకేలకు ఎన్నికలు జరిగే అవకాశాలు నెలకొన్నాయి. ఎన్నికలు జరిగితే మేయర్ పదవి ఆశించే వారిలో అత్తి సత్యనారాయణ కూడా ఒకరని సుస్పష్టం. ఈ నేపథ్యంలోనే సత్యనారాయణను తప్పించారనే విమర్శలూ లేకపోలేదు. ఒకే నెలలో జరిగిన ఈ రెండు పరిణామాలు జనసైనికులను డైలమాలో పడేస్తున్నాయి. ప్రశ్నించడం కోసమే పార్టీ పెట్టామంటూ ప్రకటనలు చేసే జనసేనాని ప్రశ్నలను తట్టుకోలేకపోతున్నారని సుస్పష్టం.



చర్చల్లో మాట్లాడుతున్న కార్మిక సంఘాల గౌరవాధ్యక్షులు అరుణ్

ఫలించని చర్చలు

- కొనసాగనున్న పేపర్‌మిల్లు కార్మికుల సమ్మె
- లాకౌట్ ప్రకటనపై మంత్రి కందుల దుర్గేష్ సీరియస్
- యాజమాన్యం దురుసు ప్రవర్తనపై కలెక్టర్ ఆగ్రహం
- యాజమాన్యం మొండి వైఖరి సరైంది కాదు: టి. అరుణ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎపి పేపర్ మిల్లు కార్మికుల సమ్మె నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన చర్చలు ఫలించలేదు. ఎపి పేపరు మిల్లు లాకౌట్ చేస్తున్నామని, 11 కార్మిక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను, ఆందోళనల్లో కీలకంగా పని చేస్తున్న మరో 25 మంది కార్మికులను సస్పెండ్ చేస్తున్నామంటూ యాజమాన్యం శుక్రవారం ఉదయం నోటీసు బోర్డులో పేర్కొంది. ఈ నేపథ్యంలో కార్మికులు పాలనా యంత్రాంగం ఎదుట తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ చర్చల అనంతరం పేపరు మిల్లు లాకౌట్, కార్మికులపై సస్పెన్షన్ ఎత్తివేతకు యాజమాన్యం అంగీకరించింది. ఈ నెల 16న ఛీఫ్ సెక్రటరీ వద్ద నిర్వహించే సమావేశానికి సంస్థ యాజమాన్యంతో పాటు కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని నిర్ణయించారు. అయితే యాజమాన్య ప్రతినిధుల తీరుపై నమ్మకం కోల్పోయిన కార్మికులు తమ సమ్మెను యదాతథంగా కొనసాగిస్తామంటూ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి సమ్మె యథాతదంగా కొనసాగనుంది. ఈ సమావేశానికి కలెక్టరు పి.ప్రశాంతి సమావేశానికి అధ్యక్షత వహించారు. మంత్రి కందుల దుర్గేష్, ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, ఎంఎల్‌సి సోము వీర్రాజు, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, కార్మిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ పేపరుమిల్లు యాజమాన్య ప్రతినిధుల తీరుపై సీరియస్ అయ్యారు. ఇరు పక్షాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు తాము ప్రయత్నిస్తున్నామని యాజమాన్యం ఇంతలోనే లాకౌట్ ప్రకటించడం, కార్మికులను సస్పెండ్ చేయడం చట్టవిరుద్ధమన్నారు. గతేడాది సమావేశం నిర్వహించినప్పుడు యాజమాన్యం ఉన్నతస్థాయి యాజమాన్యంతో మాట్లాడి జవాబిస్తామని చెప్పినా నేటికీ ఆ దిశగా అడుగులు ఎందుకు వేయలేదని నిలదీశారు. కలెక్టరు పి.ప్రశాంతి మాట్లాడుతూ యాజమాన్య ప్రతినిధుల వైఖరి సరిగా లేదన్నారు. కార్మికుల ప్రశ్నలకు సానుకూలంగా సమాధానం ఇవ్వకపోగా ప్రతి విమర్శలు చేయడం, సమావేశంలో దురుసుగా ప్రవర్తించడం ఆగ్రహం వ్యక్తం చేశారు.. పేపరుమిల్లు కార్మిక సంఘాల గౌరవ అధ్యక్షులు టి.అరుణ్ మాట్లాడుతూ తక్షణమే వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. మిల్లులో 11 సంఘాలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని స్పష్టం చేశారు. గతంలో ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్న యాజమాన్యం తాజాగా ఎన్నికల ప్రస్తావనను తీసుకురావడం అవకాశవాదాన్ని దర్పణం పడుతుందన్నారు. సంస్థ ఈడి ముఖేష్ జైన్ మాట్లాడుతూ సంస్థ నష్టాల్లో ఉందంటూ చెప్పుకొచ్చారు. గౌరవ అధ్యక్షులు టి.అరుణ్ మాట్లాడుతుండగా పలు మార్లు అడ్డుపడ్డారు. ఈ సమావేశంలో 11 కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలోని సమావేశ మందిరంలో శుక్రవారం మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ముఖ్యఅతిథిగా హాజర మాట్లాడారు. న్యాయ మధ్యవర్తిత్వంపై ప్రొఫెషనల్ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కేరళ మధ్యవర్తిత్వ కేంద్రానికి చెందిన సీనియర్ ట్రైనర్లు వివి.థాంకచన్, పిజి.సురేష్‌లకు ఆమె స్వాగతం పలికారు. శిక్షణలో పాల్గొనబోతున్న అన్ని మధ్యవర్తిత్వ నిపుణులకు అభినందనలు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా సమస్యల పరిష్కారానికి సహకార దృక్పథాన్ని అభివద్ధి చేసుకునే వీలుంటుందన్నారు. కుటుంబాలు, కార్యాలయాలు, సమాజమంలో వివాదాలు సహజంగా వస్తాయన్నారు. వాటిని ఎలా పరిష్కరించాలనే దానిపై మన ధోరణి ముఖ్యం అన్నారు. మధ్యవర్తిత్వం ఒక తటస్థమైన పద్ధతి అన్నారు. అన్ని పక్షాల వాదనలు విని, పరస్పర సహకారంతో పరిష్కార మార్గాలు చూపుతుందన్నారు. మధ్యవర్తిత్వ సూత్రాలు, విధానాలు, కేస్ స్టడీలు, ప్రాక్టికల్ వినియోగం, సీనియర్ నిపుణుల అనుభవాలను తెలుసుకుంటూ వాటిని ఆచరణ సాధ్యం చేయడమే ఈ శిక్షణ ఉద్దేశ్యమన్నారు. ముఖ్యంగా 2023 మధ్యవర్తిత్వ చట్టం ప్రవేశంతో ఇది మరింత కీలకమైన ప్రక్రియగా మారిందన్నారు. మధ్యవర్తిత్వానికి కొన్ని ముఖ్య అంశాలు ఉండాలన్నారు. కరుణ, శ్రద్ధతో వినడం, తటస్థత, నిష్పక్షపాతిక, స్పష్టమైన, గౌరవ ప్రదమైన సంభాషణ, సహకార పద్ధతిలో సమస్యల పరిష్కారం వంటి ఉండాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 86 మంది న్యాయవాదులు పాల్గొన్నారు.



కొవ్వూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న న్యాయవాదులు, జడ్జిలు

కొవ్వూరు : న్యాయవాదులు కక్షిదారులు మధ్యవర్తిత్వంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా 9వ అదనపు జడ్జి ఎం.అనురాధ సూచించారు. కోర్టు ప్రాంగణం నుంచి విజయ విహార్ సెంటర్ వరకు న్యాయవాదులతో కలిసి న్యాయమూర్తులు ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 10 నుంచి 16 వరకు మధ్యవర్తిత్వంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జివిఎల్.సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వర్రే నాగమురళి, సీనియర్ న్యాయవాదులు ఎన్‌వి.సుబ్బారావు, నీరుకొండ సూర్యనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.



గోదారికి వరద తాకిడి

ధవళేశ్వరం వద్ద 9.70 అడుగుల నీటిమట్టం

ప్రజాశక్తి -కొవ్వూరు

గోదావరికి వరద తాకిడి తగిలింది. నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో స్థాన ఘట్టం దిగువ స్థాయి మెట్లన్నీ పూర్తిగా నీట మునిగాయి. ధవళేశ్వరం ఆనకట్ట వద్ద శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 9.70 అడుగులకు నీటిమట్టం చేరింది. దీంతో బారేజీకి 175 గేట్లను పెకి లేపి 3,54,341 క్యూసెక్కులను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. జిల్లాలోని మూడు డెల్టాలకు 13,750 క్యూసెక్కుల నీటిని సాగునీటి అవసరాల నిమిత్తం విడిచిపెడుతున్నారు. భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రం 6 గంటలకు నీటిమట్టం 37.20అడుగులకు చేరింది. ఇక్కడ నీటిమట్టం నలభై అడుగులకు చేరే అవకాశం ఉందని జలవనలు శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు వద్ద శుక్రవారం రాత్రి 8 గంటలకు 4,23,756 క్యూసెక్కుల వరద మీరు వస్తుందని అధికారులు అంచనా వ్వేఆరు. శనివారం వరద ఉధతి అధికంగా ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

డిగ్రీలో డ్యూయల్ మేజర్‌ను కొనసాగించాలి

ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు ప్రారంభించాలి :ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

డిగ్రీలో డ్యూయల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని, అడ్మిషన్లను ఆఫ్‌లైన్‌లో ప్రారంభించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిగ్రీ ఆర్‌జెడి కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యంకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు, సహాయక కార్యదర్శి ఎస్.కనక, కె.జ్యోతిర్మయి మాట్లాడారు. రోజుకో మాట పూటకో విధానంలా ఉన్నత విద్యామండలి తీరు ఉందన్నారు. డ్యూయల్ డిగ్రీ విధానం అమలు పరుస్తున్నామని ఉత్తర్వులిచ్చి తిరిగి రివ్యూ జరిపి సింగిల్ మేజర్ విధానం కొనసాగిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వ విధానాలను నిలదీసిన విద్యాశాఖ మంత్రి లోకేష్ నేడు అదే బాటలో అడుగులు వేస్తున్నారని విమర్శించారు. ఇష్టానుసారంగా నెలకో నిర్ణయం చేయడం విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడటమేనన్నారు. విద్యార్థి చదువుకు తగ్గట్టుగా ఇంటర్న్‌షిప్ ఇవ్వాలని, ఆ సమయంలో స్టయిఫండ్ ఇచ్చేలా సంబంధిత పరిశ్రమలతో ఒప్పందం చేసుకోవాలన్నారు. ఇంటర్న్‌షిప్ ప్రాంతాల్లో విద్యార్థులకు భద్రత ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటర్ ఫలితాలు వెలవడి మూడు నెలలైనా నేటికీ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించకపోవడం దారుణమన్నారు. ఆఫ్‌లైన్‌లోనైనా డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐనాయకులు చైతన్య, శివ బాలాజీ, కార్తిక్, హేమంత్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.



పరిశుభ్రత కోసం ఒఎన్‌జిసి వాక్‌థాన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్వచ్ఛత పఖ్వాడా ప్రచారంలో భాగంగా ఒఎన్‌జిసి ఆధ్వర్యంలో శుక్రవారం కంబాల చెరువు నుంచి పుష్కర ఘాట్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. శుభ్రత, వ్యర్థాల విభజనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఒఎన్‌జిసి ఉద్యోగులు, సిబ్బంది, ఎపిఎస్‌పిఎఫ్ సిబ్బంది, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసెట్ మేనేజర్ సంతనుదాస్ మాట్లాడారు. ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛత పఖ్వాడా లక్ష్యాలకు ఒఎన్‌జిసి కట్టుబడి ఉందన్నారు. సిఎస్‌ఆర్ కార్యక్రమాల ద్వారా ఉద్యోగులు, విద్యార్థులను భాగస్వామ్యం చేసి పరిశుభ్రమైన సంస్కృతిని ప్రోత్సహించడానికి ఒఎన్‌జిసి ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ ఏడాది 'స్వచ్ఛత అనేది అందరి వ్యాపారం' అనే థీమ్‌తో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సాధించడంలో సమాజంలోని అందరి బాధ్యత అన్నారు. సామాజిక శ్రేయస్సు, పర్యావరణ స్థిరత్వం కోసం ఒఎన్‌జిసి ఎప్పుడూ పాటుపడుతుందన్నారు. పక్షం రోజుల పాటు ఈ స్వచ్ఛత పఖ్వాడా కార్యాక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పరిశుభ్రత, పారిశుధ్యం, పర్యావరణ రక్షణ వంటి వాటిపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. వ్యర్థాల నిర్వహణపై వర్క్‌షాపులు, వివిధ ప్రదేశాలు, కార్యాచరణ ప్రాంతాల్లో డ్రెయినేజీల శుభ్రత, పాఠశాల విద్యార్థులకు క్విజ్, పోస్టర్ తయారీ, నినాదాలు-రచన వంటి విభాగాల్లో సృజనాత్మక పోటీలు నిర్వహిస్తామన్నారు. కళారూపాల ద్వారా పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తాన్నారు.





వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న అసెట్ మేనేజర్ సంతానుదాస్

పెన్షనర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి-నల్లజర్ల

పెన్షన్ దారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వస్తే ఉద్యోగం వదులుకోవాల్సి వస్తుందని సచివాలయ సిబ్బందిని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. నల్లజర్ల మండలం జగన్నాథపురంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌దారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు వచ్చిన ఆరోపణలు నేపథ్యంలో శుక్రవారం ఆమె క్షేత్ర స్థాయిలో విచారణ జరిపారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో 496 మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. 22 శాతం మందికి ఇంటి వద్ద పెన్షన్ పంపిణీ చేయట్లేదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. ఆమె వెంట గ్రామస్తులు బుడిగిన బాలాజీ, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి, ఎంపిడిఒ తదితరులున్నారు.

మెరిట్ విద్యార్థినికి రూ.లక్ష అందజేత

ప్రజాశక్తి - చాగల్లు

గతేడాది పదో తరగతిలో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిధిప్రియకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయిన పసుమర్తి బేబి సుజాత అందించారు. ఈ మొత్తాన్ని మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో విద్యార్థినికి అందించారని హెచ్‌ఎం ఎంవి.రమణ తెలిపారు. గత సంవత్సరం రూ.1.30 లక్షలను ఆమె అందించారని తెలిపారు.



నర్సరీలను సందర్శించిన కర్ణాటక మంత్రి

ప్రజాశక్తి-కడియం

కర్ణాటక రాష్ట్ర మైనింగ్, జియాలజీ, హార్టికల్చర్ శాఖ మంత్రి ఎస్ఎస్.మల్లికార్జున్ శుక్రవారం కడియం నర్సరీలను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి ఎకెఎస్‌వి నర్సరీ రైతు, నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయ్యప్ప మంత్రికి నర్సరీల అభివృద్ధిని వివరించారు. పలు రకాలు పండ్ల, పూల మొక్కలు, వృక్షాల పెంపకంపై మంత్రి రైతులను అడిగి తెలుసుకున్నారు. హార్టికల్చర్ రంగంలో రెండు రాష్ట్రాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయాలని మంత్రి అభిప్రాయపడ్డారు. నర్సరీల సందర్శనకు విచ్చేసిన మంత్రికి స్థానిక నర్సరీ రైతులు, అసోసియేషన్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.

ఆర్ఎస్‌కెను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-నల్లజర్ల


నల్లజర్ల రైతు సేవా కేంద్రం-1 పరిధిలో పచ్చిరొట్ట విత్తనాలు సరఫరాలో జాప్యంపై రైతులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం ఆర్ఎస్‌కు సందర్శించారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడారు. మార్చి నెలలో సరఫరా చేయాల్సిన పచ్చి రొట్ట విత్తనాలు. జీలుగ, జనుము, పిల్లి పెసరలను మే నెలలో సరఫరా చేశారని రైతులు తెలిపారు. కలెక్టర్ వెంట ఎఒ సోమశేఖర్, ఆర్ఎస్‌కె సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం పరిధిలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ముగ్గుళ్ళ 33/11 కెవి సబ్-స్టేషన్ పరిధిలోని 11 కెవి ఫీడర్లల నిర్వహణ పనులు చేపడుతున్నందున ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపేస్తామనిరాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెపిబి.నటరాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి గ్రామాలకు విద్యుత సరఫరా ఉండదన్నారు. ఈ పరిధిలోని వ్యవసాయ బోర్లకు కూడా విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

కార్టూ'నిజం'



పేదలకు వైద్యసాయం అభినందనీయం

ప్రజాశక్తి - నిడదవోలు

ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి పేదలకు వైద్య సాయం అందించడం అభినందనీయమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలోని చర్చిపేటలో మంత్రి దుర్గేష్ పర్యటించారు. బీసీ కమ్యూనిటీ హాల్లో హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్, హోప్ ఫర్ చిల్డ్రన్ సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సంస్థకు అభినందనలు తెలిపారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోన్న సంస్థ సభ్యులు జువ్వల రాంబాబు, అంగారపు ప్రసన్నరాజు మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ వైద్య శిబిరంలో 280 మందికి వైద్య పరీక్షలు నిర్వమించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, బలుసు ఆనంద్ కుమార్, గుమ్మాపు ప్రకాశం, రాఘవేంద్ర కుమార్, ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సంస్థ టీమ్ కో-ఆర్డినేటర్ జయరాజు, వైద్యులు వాసవి, జితేంద్ర, భరత్, మనోజ్ఞ, ఇతర టెక్నీషియన్స్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నన్నయ్య విసికి నెల్సన్ మండేలా ఇన్‌స్పైర్ అవార్డు

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విసి ప్రసన్నశ్రీకి 2025 సంవత్సరానికి సంబంధించి ప్రతిష్టాత్మక నెల్సన్ మండేలా ఇన్‌స్పైర్ అవార్డు లభించింది. ఫేమస్ పీపుల్ ఇండియా వరల్డ్ ఆర్గనైజేషన్ ఆమెకు ఈ అవార్డును అందించనుంది. భాషాశాస్త్రం విద్యా రంగంలో ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ చేసిన కృషి జాతీయ అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది. 19 గిరిజన భాషలకు లిపిని అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు. 2022లో భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైన నారీ శక్తి పురస్కార్, 2024లో అక్షరమాల ప్రాజెక్ట్ అవార్డును ఆమె అందుకున్నారు.

విద్యార్థినికి రూ.20 వేల ఆర్థిక ప్రోత్సాహం

ప్రజాశక్తి - బిక్కవోలు

కొంకుదురు ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని రెడ్డి శ్రావ్యవర్షితకి హైదరాబాద్‌కు చెందిన ఎంజె.నాయుడు ట్రస్ట్ వారు రూ.20వేల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ చెక్కును సర్పంచ్ సత్తి వీరమణి, రాజా దంపతులు చేతుల మీదుగా విద్యార్థినికి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రతిభ చూపే విద్యార్థులకు ఈ విధంగా గుర్తింపు రావడం గర్వకారణమన్నారు. ప్రతి విద్యార్థీ లక్ష్యాలపై దృష్టి సారించి కష్టపడి చదివితే ఇలాంటి ఎన్నో విజయాలు సొంతం అవుతాయన్నారు. హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థిని మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్ద కె.వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కాల్దరి ఎంపిపిఎస్ నెంబర్-3 పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం విద్యా సామగ్రి అందజేశారు. మెగా పేరెంట్స్ మీటింగ్ స్ఫూర్తితో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు కుసుమ పలువురు దాతలను సమీకరించి, వారి ఆర్థిక సాయంతో విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు, బాక్సులు, పలకలను కొనుగోలు చేసి గ్రామ పెద్దల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలను గ్రామ పెద్దలు ఈర్పిన సత్యనారాయణ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేరాలు ఘోరాలు



నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ మద్దిపాటి

విద్యుదాఘాతంతో వ్యక్తి మరణం

ప్రజాశక్తి -దేవరపల్లి, గోపాలపురం

దేవరపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలో శుక్రవారం ఉదయం విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. .పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం మండలం వేళ్ళచింతలగూడెం గ్రామానికి చెందిన మండపాటి రాజేష్ (25) గొల్లగూడెంలో మెయిన్ రోడ్ పక్కన కరెంటు స్తంభానికి నిచ్చెన వేసుకొని కేబుల్ వర్క్ చేస్తున్నాడు. ఈ సమయంలో 11కెవి వైరు చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. తండ్రి మండపాటి చంటియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాజేష్ మృతి వార్తతో తల్లిదండ్రులు బోరున రోదిస్తున్నారు. వారిని సముదాయించడం ఎవరితరమూ కావట్లేదు. ఎదిగొచ్చిన కొడుక లేడనే నిజాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. త్వరలోనే వివాహం చేద్దామనుకునే సరికి ఇలా జరగడంతో దుఃఖ:సాగరంలో మునిగిపోయారు.

రాజేష్ మృతి బాధాకరం : ఎంఎల్ఎ మద్దిపాటి

రాజేష్ అకాల మృతి బాధాకరమని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. రాజేష్ భౌతికకాయాన్ని ఆయన సందర్శించి నివాళు లర్పించారు. మతుడికి టిడిపి సభ్యత్వం ఉండడంతో రూ.5 లక్షల బీమా అందిస్తామని తెలిపారు. కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం సింగవరం గ్రామంలో శుక్రవారం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం సంభవించింది. గ్రామానికి చెందిన వీరమాచి పోసియ్యకు చెందిన ఇంటిలో గ్యాస్ బండ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి గడ్డి పాకను చుట్టుముట్టాయి. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న కాసు బంగారు మంగళ సూత్రాలు, రూ. 30 వేల నగదు, ఫ్రిజ్, తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. బాధితులకు తక్షణ సాయంగా బియ్యం అందించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-రాజోలు

రాజోలు సుందరమ్మ చెరువుగట్టుకు చెందిన దీపాటి మణి రావు (38) మృతి పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మణిరావు గురువారం తాపీ పనికి వెళ్ళి రాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. శుక్రవారం ఉదయం ఇంటి బయట శవమై కనిపించాడు. మృతుడు స్వస్థలం మలికిపురం మండలం లక్కవరం. ఉపాధి రీత్యా దుబాయ్ దేశం వెళ్లి ఏడాది క్రితం తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి రాజోలులో అత్తవారి ఇంటి వద్ద ఉంటూ అప్పుడప్పుడు తల్లిని చూసేందుకు లక్కవరం వెళు తుంటాడు. రోజు మాదిరిగానే పని నుంచి రాత్రి ఇంటికితిరిగి వచ్చిన అతను తెల్లవారే సరికి ఇంటి బయట మతి చెంది ఉండటం పలు అనుమానాలకు తావిస్తుంది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య దీపాటి స్వర్ణ లత ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేలు ముందు తాగి ఒక వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పేలు ముందు తాగి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేబ్రోలు ఇబిసి కాలనీలో నివాసముండే మాగిరెడ్డి పాండవులు (49) తన ఇంటి వద్ద మద్యం ఎక్కువగా తాగాడు. తరువాత మద్యం మత్తులో పేలు మందు కలుపుకుని తాగాడు. వెంటనే భార్య చూసి పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పాండవులుకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమారుడు నాగబాబు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రామకృష్ణ తెలిపారు.

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లాలో పలుచోట్ల ర్యాలీలు జరిగాయి. సురక్షిత కాన్పులు, గర్భధారణల మధ్య సమయం వంటి వాటిపై వైద్యులు అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం రూరల్‌లో డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి బొమ్మూరు సెంటర్ వరకు వైద్య సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఈ ఏడాది 'ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం మరియు అంతరం'పై థీమ్‌తో అవగాహన కల్పిస్తున్నామన్నారు. శరీరం, మనస్సు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నప్పుడు మాత్రమే తల్లి కావాలన్నారు. ఆడబిడ్డకు 21 ఏళ్ళు, మగ బిడ్డకు 25 ఏళ్ల వచ్చేవరకూ వివాహం చేయరాదన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా పిహెచ్‌సిలు, ఆరోగ్య సచివాలయాల్లో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు, ర్యాలీలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యకుమార్ నల్లూరి, డిఎస్ఒ డాక్టర్ టి.రాజీవ్, డిప్యూటీ ఎస్ఒ భాస్కర్, సిహెచ్ఒ శర్మ, ఎంపిహెచ్ఒ బి.రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్ఒ, ఆరోగ్య సిబ్బంది

ఉండ్రాజవరం : ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, పబ్లిక్ హెల్త్ నర్స్ కెడివిఎల్.కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు అనుపోజు శ్రీరామమూర్తి, సిహెచ్.మేరీరత్నకుమారి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలను ధిక్కరించి బస్సు షెల్టర్ నిర్మాణం

ప్రజాశక్తి - సీతానగరం



మండలంలోని కూనవరంలో కోర్టు ఆదేశాలను ధిక్కరించి అక్రమంగా బస్సు షెల్టర్ నిర్మించారని, ఈ నిర్మాణం తమ దుకాణాలకు అడ్డుగా ఉందని బాధితుడు సుందరపల్లి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ సెక్రటరీ సుధాకర్ నిర్వాహకం కారణంగా తమకు అన్యాయం జరిగిందని, సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబం 50 ఏళ్లుగా కూనవరం గ్రామంలోని సర్వే నెంబరు 95లో ఉంటోందన్నారు. ఈ స్థలంలోని మూడు సెంట్ల భూమికి సంబంధించి తన తల్లి సుందరపల్లి సావిత్రి పేరున పట్టా కూడా ఉందన్నారు. ఇటీవల గ్రామంలో రోడ్డు విస్తరణ, కాంక్రీట్ కాలువ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. ఈ క్రమంలోనే పంచాయతీ సెక్రటరీ సుధాకర్ ఎటువంటి విచారణ లేకుండానే పంచాయతీ తీర్మానం చేసి బస్సు షెల్టర్ నిర్మాణానికి పూనుకున్నారని తెలిపారు. తమ దుకాణాలకు ఈ నిర్మాణం అడ్డుగా ఉందని శ్రీనివాస్ వాపోయారు. ఈ అక్రమ నిర్మాణంపై తాము కోర్టును ఆశ్రయించామన్నారు. ఈ మేరకు కోర్టు మే 26న పంచాయతీ సెక్రటరీతో పాటు తహశీల్దార్, సబ్ కలెక్టర్, ఆర్ అండ్ బి అధికారులకు నోటీసులు జారీ చేసిందన్నారు. కాని వారి నుంచి స్పందన రాలేదని, నిర్మాణం ఆగకపోవడంతో ఇంజక్షన్ ఆర్డర్‌క ఊడా పంపించామన్నారు. అయినప్పటికీ, కోర్టు ఆదేశాలను ధిక్కరించి సెక్రటరీ కట్టడాన్ని పూర్తి చేయించారని తెలిపాడు. కోర్టు ఆదేశాలను ధిక్కరించిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకుని, తమ దుకాణాలకు అడ్డుగా ఉన్న ఈ అక్రమ కట్టడాన్ని తొలగించి తమకు న్యాయం చేయాలని సుందరపల్లి శ్రీనివాస్ ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఎన్‌సిసిలో ఆర్ట్స్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సిసి విద్యార్థులకు జాతీయ ప్రతిభా పురస్కారం దక్కింది. వీరిని ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు ప్రత్యేకంగా అభినందించారు. కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న సీనియర్ అండర్ ఆఫీసర్ ఎం.ప్రవీణ్ కుమార్‌దొర న్యూఢిల్లీలో జరిగిన ఆలిండియా థలసైనిక్ క్యాంప్‌లో పాల్గొని ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ డైరెక్టరేట్ తరపున జడ్జింగ్ డిస్టెన్స్ మరియు ఫీల్డ్ సిగ్నల్స్ అనే అంశంలో ద్వితీయ స్థానాన్ని సాధించారు. సీనియర్ అండర్ ఆఫీసర్ కవిత రిపబ్లిక్ డే క్యాంప్ లో పాల్గొని జనవరి 26న కర్తవ్యపద్‌లో పాల్గొని కళాశాలకు ఖ్యాతిని సంపాదించారని తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 4న కాకినాడ ఎన్‌సిసి గ్రూప్‌ను సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎన్‌సిసి ఎయిర్ కమాండో నరసింగ్ సైలాని ఉత్తమ క్యాడెట్ మెడల్స్‌ను బహుకరించారన్నారు. ఎన్‌సిసిలో రాణిస్తున్న విద్యార్థులను మరోసారి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ డాక్టర్ షేక్ ఈసుబ్ బాషా, డాక్టర్ కె.అనూష, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరామమూర్తి, సహాయ ప్రిన్సిపల్ జి.చంద్రశేఖర్, తదతరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ డ్రోన్లు అందజేత

ప్రజాశక్తి -కొవ్వూరు

రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై డ్రోన్లను అందజేస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వర రావు సూచించారు. శుక్రవారం కొవ్వూరు టిడిపి కార్యాలయంలో పట్టణానికి చెందిన తారకరామా కిసాన్ గ్రూపునకు సబ్సిడీపై మంజూరైన డ్రోన్‌ను ఎంఎల్ఎ అందించారు. డ్రోన్ పూర్తి ధర రూ.9.80 లక్షలు కాగా, ప్రభుత్వం రూ.7.80 లక్షలు సబ్సిడీ అందిస్తుందన్నారు. డ్రోన్ మొత్తం ధరలో రైతు రూ.1.90 లక్షలు కట్టాల్సి ఉంటుందన్నారు. దీన్ని కొవ్వూరు బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా రుణంగా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ ఎ.గంగాధర్‌రావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు, పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్లు అందిస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు



పాంప్లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలి

ప్రజాశక్తి - గోపాలపురం

రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని ఎస్ఐ పి.మనోహర్ సూచించారు. ఈనెల 30న మెగా రక్తదాన శిబిరాన్ని శారవాణి రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పాంప్లెట్‌లను ఎస్ఐ మనోహర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానవత స్వచ్ఛంద సేవ సంస్థ చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకుని రక్తదానం చేయాలని కోరారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షులు ఫణి కిషోర్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం జక్కంపూడి బ్లడ్ బ్యాంకు ద్వారా రక్తం సేకరణ జరుగుతుందన్నారు. 18 ఏళ్ల నిండి 50 కిలోలు బరువు ఉన్న యువతీ యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోడాల వెంకటేశ్వరరావు, శేఖర్, కృపావరప్రసాద్‌రెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే నేరుగా కలవండి : ఎంఎల్ఎ ముప్పిడి

ప్రజాశక్తి - కొవ్వూరు

నియోజకవర్గంలో ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్‌డేలో తనకు తెలియజేయాలని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి వాటికి పరిష్కార మార్గాలు సూచించారు. ఆయన వెంట అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, వేమగిరి వెంకట్రావు, జయరాజు, సుబ్బారావు తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-తాళ్లపూడి

తమ చిన్నారులకు చదువు చెపుతున్న ఉపాధ్యాయులను సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు తల్లిదండ్రులు అన్నారు. మండలంలోని ప్రక్కిలంక మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాలలోని ఉపాధ్యాయులను గురు పౌర్ణమి సందర్భంగా గురువారం పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు శేషాబాయమ్మ, సరస్వతి, రామకృష్ణ, పద్మావతి, కనకదుర్గ, జయశ్రీ సన్మానం అందుకున్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ ముళ్ల రాజశేఖర్, పి.ప్రశాంతి, ఎస్.పోచమ్మ, రాధిక, విజయదుర్గ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గౌరిపల్లిలో సుపరి పాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం గౌరిపల్లిలో శుక్రవారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలో కొచ్చిన ఏడాది పాలనలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు తెలియజేశారు. త్వరలో కూటమి ప్రభుత్వం చేపట్టబోయే అభివద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. ఇంటింటా తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సహకరించాలి

ప్రజాశక్తి - చాగల్లు

పేద విద్యార్థులకు సహకరించాలని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు ఎన్ఆర్ఐలకు సూచించారు. చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన పిఫోర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలం నుంచి విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు, యువపారిశ్రామిక వేత్తలు గ్రామంలో స్థితిమంతులు ఆయా గ్రామాల్లో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించాలన్నారు. ఇటీవల మలకపల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో స్థానిక పారిశ్రామికవేత్తలతో పాటూ కలెక్టర్ కూడా ముందుకొచ్చి ఒక యువకుని దత్తత తీసుకున్నారన్నారు. అలాగే మిగిలన వారు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఎఎంసి చైర్మన్ నాదెల శ్రీరామ్‌చౌదరి, టిడిపి నాయకులు ఆళ్ల హరిబాబు, సొసైటీ అధ్యక్షులు మద్దుకూరి వీరరాఘవులు, వై.అబ్బులుచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో ఖాళీ స్థలాల యజమానులు స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్, ఇన్‌ఛార్జి కమిషనర్ పి.ప్రశాంతి సూచించారు. ప్రస్తుతం చాలా చోట్ల నివాసాల మధ్యలో ఏళ్ల తరబడి ఖాళీ స్థలాలు అపరిశుభ్రంగా, పిచ్చి మొక్కలతో తీవ్ర అసౌకర్యంగా ఉన్నాయన్నారు. ఫలితంగా దోమలు, వ్యాధికారక క్రిమి కీటకాలు, పాములు చేరుతున్నాయన్నారు. వీటిపై ఇప్పటికే పలు ఫిర్యాదులు కూడా అందాయన్నారు. నగరంలో స్వచ్ఛతను కాపాడేందుకు వార్డు సచివాలయాల వారీగా స్థల యజమానులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లో కంపచెట్లు మొలిచి అపరిశుభ్రంగా ఉంటే నోటీసులు జారీ చేస్తున్నట్లు వివరించారు. స్పందించని యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్ల నిర్మాణాలపై అవగాహన

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరం నగర పంచాయతీ రహదారుల నిర్మాణాలపై చైర్‌పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య అధ్యక్షతన శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కాకినాడ ఉప ప్రణాళికాధికారి సత్యనారాయణ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2026 ఆర్థిక సంవత్సరం నుంచి డ్రాఫ్ట్ ప్లాన్ సిద్ధం చేసినట్టు తెలిపారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని తిరుమాలి, లింగంపర్తి, సి.రాయవరం, ఏలేశ్వరం మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రోడ్ల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు అభ్యంతరాలు ఏమైనా ఉంటే సంబంధిత రైతులు తమకు తెలియజేయాలన్నారు. రానున్న పదేళ్ల లోపు ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ సదస్సులో శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద్ బాబు, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

కామరాజుపేట హైస్కూల్లో వైద్య శిబిరం

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని కామరాజుపేట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గోకవరం ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ భారతి, జడ్పిటిసి మాజీ సభ్యులు పాలూరి బోసుబాబు, హైస్కూల్ చైర్మన్ బూతుకూరి రాధాకృష్ణ, సొసైటీ చైర్మన్ పిల్ల వెంకటేశ్వరరావు, ఎం.ప్రసాద్, రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజలకు చేదోడుగా కూటమి సర్కారు'

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజల కష్టసుఖాల్లో చేదోడుగా నిలబడుతుందని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. శుక్రవారం వేలివెన్నులోని ఆయన స్వగృహంలో నియోజకవర్గానికి సంబంధించి, ప్రభుత్వం విడుదల చేసిన ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అనారోగ్య కారణాల ఆసుపత్రుల్లో డబ్బులు చెల్లించి, వైద్య సేవలు పొందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.40.52 లక్షల విలువ చేసే 54 చెక్కులను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో బ్ధిదారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బిఎల్‌ఒలు బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఓటర్ల జాబితా తయారీలో బిఎల్‌ఒలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరములో బూత్ లెవెల్ అధికారులకు శుక్రవారం నిర్వహించిన ట్రైనింగ్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో బిఎల్‌ఒల పాత్ర కీలకమన్నారు. ఫారం-6, 6ఎ, 7, 8, ఓటర్ల జాబితా తయారీ, మార్పులుచేర్పులు, తదితర సమచారం ఎలాంట అందించాలని వివరించారు. విధి నిర్వహణలో బిఎల్‌ఒలు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలకు సంబంధించిన ప్రాథమిక అంశాలపైన పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. భారత రాజ్యాంగంలో గల అధికరణాలు, ఎన్నికలకు సంబంధించిన ప్రజా ప్రాతినిధ్య చట్టం, ఎన్నికల నమోదు చట్టం, తదితర చట్టాల్లోన్ని ముఖ్యమైన సెక్షన్లు గూర్చి కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. బిఎల్ఒ పత్రికను తప్పక చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, మేనేజర్ అబ్దుల్ మాలిక్, బిఎల్‌ఒలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా ఇవ్వాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రజలకు రేష్ సరుకులను సక్రమంగా అందించాలని సివిల్ సప్లయిస్ డిటి టి.దివాకర్ డీలర్లకు సూచించారు. శుక్రవారం వేలచింతల గూడెంలో 35వ నెంబర్ రేషన్ షాపులో ఆయన తనిఖీలు నిర్వహించారు. స్టాకు వివరాలు పరిశీలించారు. లబ్ధిదారుల నుంచి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ప్రతి నెలా రేషన్ షాపులను తనిఖీ చేస్తామన్నారు. ఉదయం 8-12 గంటల వరకు సాయంత్రం 4-8 గంటల వరకు రేషన్ షాపుల ద్వారా సరుకులు అందించాలని తెలిపారు.